క్లుప్తంగా

'తెలుగు బంధువు' గద్వాల సోమన్న



గద్వాల సోమన్నను సత్కరించి అవార్డును ప్రదానం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను ఆదివారం ప్రతిష్టాత్మక 'తెలుగు బంధువు' బిరుదు వరించింది. ఈ సందర్భంగా ఫోన్ ద్వారా ఆయన మాట్లాడుతూ.. విశేష తెలుగు సాహిత్యానికి చేసిన కృషి, అనతి కాలంలోనే 52 పుస్తకాలు రాసి, ముద్రించినందుకు తెలుగు కవితా వైభవం (తెలుగు అభివృద్ధి సమితి), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు కవితా వైభవం – దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అధ్యక్షుడు మేక రవీంద్ర, హైదరాబాద్ వారిచే పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా ఈ అవార్డును రవీంద్రభారతిలో అందుకున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథులు డాక్టర్ టి.గౌరీశంకర్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ దాసోజు పద్మావతి, రంగారెడ్డి జిల్లా విశ్రాంత విద్యాధికారి సి.పి. రెడ్డి, ఘంటారావం గంటా మనోహర్‌రెడ్డి, కవులు, ఉపాధ్యాయులు, కళాకారులు, సాహితీమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నట్లు వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి తీగ చోరీ



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లిన దృశ్యం

పెద్దకడబూరు: గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని నౌలేకల్లు పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రైతులు సుభాన్, ఈడిగ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై పడిఉంది. అందులోని రాగి తీగను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే లైన్‌మెన్ అంజికి ఫోన్ ద్వారా సమాచారం చేరవేసినట్లు తెలిపారు. లైన్‌మెన్ ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆలయ కమిటీ ఎన్నిక



అంబాభవానీ ఆలయ పాలకవర్గం సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన అంబాభవానీ ఆలయం నూతన పాలక కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రమాణస్వీకారం చేశారు.ఆలయ అధ్యక్షులుగా జిందే శంకర్, ఉపాధ్యక్షులుగా ఆదిశేషులు, కార్యదర్శి హుబ్లీ శంకర్, సహాయ కార్యదర్శి రఘునాథ్, కోశాధికారి వినోద్‌కుమార్, సహాయ కోశాధికారి మోహన్‌లను ఎన్నుకున్నారు. అదేవిధంగా జీవేశ్వర సమాజ్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులుగా ఎస్టీ నాగరాజ్, ఉపాధ్యక్షులుగా యువరాజ్, కార్యదర్శి సఫారే మహాదేవ్, సహాయ కార్యదర్శి పొందే లక్ష్మణ్, కోశాధికారి రామకృష్ణ, సహాయ కోశాధికారి అంబాజీలను సభ్యులు, భక్తుల సమక్షంలో ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామన్నారు. అమ్మవారి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిపిస్తామని తెలియజేశారు.

మెడికల్ కళాశాలకు నిధులు మంజూరు చేయాలి



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అర్బన్: ఆదోని పట్టణ శివారులో నిర్మితమవుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా నిధులు మంజూరు చేయాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలో మంత్రికి వినతి పత్రం అందించారు. నిధుల కొరత వల్ల మెడికల్ కళాశాల నిర్మాణం ఆలస్యమవుతోందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు జరిగేలా చూడాలని కోరారు. మెడికల్ కళాశాల పూర్తయితే ఎందరో విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కంటి చూపునకు కత్తెర

- సెల్‌ఫోన్, కంప్యూటర్ అతిగా వాడడంతో ఇబ్బందులు
- చిన్నతనంలోనే దృష్టి లోపాలు
- పెరుగుతున్న దూరదృష్టి సమస్య
- కంటి వైద్యుల వద్దకు క్యూ కడుతున్న యువత



మొబైల్, ల్యాప్‌టాప్‌ను చూస్తున్న యువతి (ప్రతీకాత్మక చిత్రం)

ఆదోని అర్బన్: సెల్‌ఫోన్ నేడు నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ఎవరి చేతిలో చూసినా ఫోన్ కనిపిస్తోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ ఫోన్‌ను వినియోగిస్తున్నారు. ఇంట్లోనూ, బయట పది మంది కలిసిన చోటు, చివరికి భోజనం చేసే సమయంలోనూ సెల్‌ఫోన్ చూడడంలో నిమగ్నమవుతున్నారు. గంటల తరబడి మొబైల్ చూడడంతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. ముఖ్యంగా మొబైల్ నుంచి వచ్చే నీలి కాంతి కిరణాలు కంటిపై ప్రభావం చూపుతాయని, దీంతో కంటిచూపు దెబ్బతినే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ మేరకు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంటి వైద్యనిపుణుడు పద్మకుమార్ యువతకు జాగ్రత్తలు, కంటి చూపును కాపాడుకునేందుకు చర్యలను వివరించారు

ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత చీకటి పడగానే భోజనం తినేసి నిద్రకు ఉపక్రమించేవారు. ఇప్పుడు ప్రజల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. రాత్రి 11 గంటల వరకు టీవీలు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్‌లు, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోతున్నారు. 60 శాతం ప్రజలు రోజులో 5 నుంచి 6 గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తున్నారు. యువత సెల్‌ఫోన్‌ను వినియోగించే సమయం మరింత ఎక్కువగా ఉంటోంది. ఇలా సెల్‌ఫోన్‌కు బానిస కావడం వల్ల చేతివేళ్లు తరచూ సెల్‌ఫోన్‌పైకి వెళ్తుంటాయి. చిన్నపిల్లలు సైతం ఫోన్‌కు అలవాటు పడ్డారు. గతంలో సూర్యుడి కాంతి మాత్రమే కళ్లపై పడేది. ఇప్పుడు సెల్‌ఫోన్లు, టీవీల నుంచి వచ్చే కృత్రిమ కాంతిలో ఉండే బ్లూ లైట్ కంటిపై ఎక్కువగా పడుతుంది. దీనివల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. చిన్న వయస్సులోనే కంటిజబ్బు బారిన పడి ఆస్పత్రుల బాట పడుతున్నారు.

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్‌ను డిజిటల్ ఐ స్ట్రీన్ అంటారు. ఇది ఎక్కువ కాలం కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు చూడడం వల్ల వస్తుంది. కళ్లు ఒత్తిడికి గురికావడం, అలిసిపోవడం, కళ్ల మంటలు, ఎరుపు కావడం, ఒక వస్తువు రెండుగా కనిపించడం, కళ్లు పొడిబారడం, నల్లగుడ్డు పొరబారడం లాంటి లక్షణాలు ఉంటాయి.

కారణాలు

డిజిటల్ పరికరాలను విస్తృతంగా వినియోగించడం, రెండు గంటల కన్నా కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను తదేకంగా చూడడం, కంప్యూటర్‌లో అక్షరాలను తదేకంగా చూడడం వల్ల కళ్లు ఒత్తిడికి గురవుతాయి. స్క్రీన్ కాంట్రాస్ట్ ఎక్కువగా ఉండడం, సాధారణంగా నిమిషానికి 18 నుంచి 20 సార్లు రెప్ప వాల్చాలి. కానీ కంప్యూటర్ చూసే వారికి ఇది మూడు నుంచి ఆరు సార్లకు పడిపోతుంది. దీనివల్ల కళ్లల్లోని ఉపరితలం పొడిబారుతుంది.

చికిత్స, నివారణ

కళ్లకు తేమ కలిగించేలా కృత్రిమంగా ఐడ్రాప్స్ వాడడం, కళ్ల రెప్పలను తరుచుగా మూయడం, దృష్టి లోపాలకు వాడే అద్దాలు, బ్లూ ఫిల్టర్ ఉండేలా చూడడం, స్క్రీన్ టైం తగ్గించుకోవడం, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను 20 సెకన్ల పాటు వీక్షించడం, కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్ బ్రైట్‌నెస్ కాంట్రాస్టను సర్దుబాటు చేసుకోవడం, కంప్యూటర్, సెల్‌ఫోన్‌లో అక్షరాలను పెద్దవిగా చేసుకోవడం, సంత్సరానికి ఒకటి రెండుసార్లు ఐ స్పెషలిస్ట్‌ను కలిసి చికిత్సలు చేయించుకోవాలి.

బ్లూ లైట్లతో కళ్లకు ప్రమాదం

మొబైల్ ఫోన్‌లో ఉండే నీలికాంతి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడడం వల్ల వాటిలోని రేడియేషన్, అల్ట్రావైలెట్ కిరణాల వల్ల కళ్లల్లో నీరు ఇంకిపోయి పొడిబారుతాయి. విద్యార్థులు, యువకులు మొబైల్ కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను దగ్గర నుంచి చూడడం వల్ల క్రమంగా వారికి దూరంగా ఉన్నవి కనిపించవు. సాధారణంగా దృష్టి లోపం ఉండే వారిలో ఏడాది నుంచి రెండేళ్లకు వారి కంటి అద్దాల నంబర్ మారుతుంది. కానీ ఎక్కువసేపు ఆన్‌లైన్ క్లాసుల కారణంగా తక్కువ సమయంలోనే కంటి అద్దాల నంబర్ మారుతుంది. దీనికితోడు వర్క్‌ఫ్రం హోం, ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మానిటర్లను చూడడం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పెరిగి సాయంత్రం వేళ తలనొప్పి వస్తుంది.

కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రతి అరగంటకోసారి మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ నుంచి రెండు నుంచి మూడు నిమిషాల పాటు దృష్టిని వేరేవైపు మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగులాల దూరం ఉంచాలి.
- యాంటీ గ్లేర్, యాంటీ రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్ల మంటలు, నీరు కారడం వంటి సమస్యలు ఉంటే కాసేపు మానిటర్‌ను చూడడం ఆపేయాలి.
- తరచూ చల్లని నీటిని కళ్లతో కడుక్కోవాలి.
- రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి బట్టను ఉంచాలి.
- కంటికి కసరత్తులు సైతం అవసరం. కళ్లను కుడి, ఎడమకు అర నిమిషం నుంచి ఒకనిమిషం వరకు తిప్పాలి.
- రెండు అరచేతులను రుద్దుకొని వేడెక్కిన తర్వాత కళ్లపై ఉంచే కసరత్తు చేయాలి.

ఎక్కువసేపు సెల్‌ఫోన్‌ను చూడరాదు



కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను ఎక్కువ సేపు చూడడం వల్ల అందులోని నీలికాంతి కళ్లపై పడి కళ్లు దెబ్బతింటాయి. కంటి జబ్బులతో వస్తున్న వారిలో కళ్లు పొడిబారడం, ఎర్రగా కావడం, మంటలు రావడం, దురద వంటి సమస్యలు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్‌లను దూరంగా ఉంచాలి. కంప్యూటర్, మానిటర్‌లను ఎక్కువసేపు చూడడం మానుకోవాలి. లేకపోతే కంటి జబ్బులు తీవ్రమవుతాయి. కంటి చూపు కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించాలి. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్ అలవాటు చేయవద్దు.

– డాక్టర్ పద్మకుమార్, కంటి వైద్యనిపుణుడు, ఆదోని జనరల్ ఆస్పత్రి

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు



గోనెగండ్ల పోలీస్‌స్టేషన్ రోడ్డు వద్ద డ్రంకన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న పోలీసులు

గోనెగండ్ల: మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు గోనెగండ్లలోని పోలీస్ స్టేషన్ రోడ్డు ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారికి, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడుపరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది శ్రీరాములు, మద్దిలేటి, ఖాజా పటేల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



పరుగు పందెం విజేతలను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ ముత్తమ్మ

పెద్దకడబూరు: మండలంలోని పల్లెల్లో మూడు రోజులుగా ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. వృషభాలకు రంగులు అద్ది ప్రత్యేకంగా అలంకరించి పారువేట నిర్వహించారు. యువత ఉత్సాహంతో పరుగు పందెలు, గుండు ఎత్తే పోటీలు తదితర గ్రామీణ క్రీడలలో మునిగితేలారు. చిన్నతుంబళం గ్రామంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన పరుగు పందెంలో కురువ యల్లప్ప విజేతగా నిలిచి ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ముత్తమ్మ మాట్లాడుతూ.. అనాధిగా వస్తున్న ఆచారాలను కొనసాగించడం సంతోషించదగ్గ విషయమన్నారు. విజేత యల్లప్పను శాలువా, పూలమాలలతో సత్కరించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో వేడుకల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మహేష్‌కుమార్ గట్టి బందోబస్తు నిర్వహించారు.

రైల్వే సేవలకు ఆటంకం కలిగించొద్దు



రైల్వే గేటు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే ఎస్‌ఐ లక్ష్మన్న

కోసిగి: రైల్వే సేవలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించరాదని ఆదోని రైల్వే ఎస్‌ఐ లక్ష్మన్న వాహనదారులు, ప్రయాణికులకు సూచించారు. ఆదివారం కోసిగి రైల్వే గేటు, రైల్వే స్టేషన్, రైల్వే పట్టాల సమీప కాలనీలలో ప్రయాణికులు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైలు పట్టాలపై రాళ్లు పెట్టడం, కదిలే రైలుపై రాళ్లు విసరడం, పట్టాలపై అటు ఇటు తిరగడం వంటివి చేయరాదన్నారు. అలాగే రైలులో ప్రయాణించే వారు రైలును ఆపేందుకు చైన్ లాగడం, వస్తువులు ధ్వంసం చేయడం వంటివి చేయడం నేరమన్నారు. రైల్వే ఆస్తులపై దాడులు చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని వివరించారు. ఎవరైనా ఆకతాయిలు అలాంటి పనులకు పాల్పడితే వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. రైల్వే ఆస్తులు కాపాడడం తమ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

కౌతాళం: యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్నబసప్ప పేర్కొన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని బ్రహ్మకుమారీ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవంను బ్రహ్మకుమారీలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నబసప్ప మాట్లాడుతూ.. నేటి సమాజంలో మానవుడు విరామం లేని జీవితాన్ని గడుపుతుండటంతో మానసికోల్లాసం కొరవడి అనారోగ్యానికి గురౌతున్నాడని, అలాంటి జీవన విధానానికి స్వస్తి పలికేందుకు మన దైనందిన జీవితంలో కొంత సమయం కేటాయించి యోగా చేస్తే మానసిక ఒత్తిడిలను జయించవచ్చని తెలిపారు. అనంతరం బ్రహ్మకుమారి వ్యవస్థాపకుల్లో ఒకరైన మమ్మా వర్ధంతి సందర్భంగా కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. గ్రామస్తులు సిద్దు, రాజబాబులు పాల్గొన్నారు.





అధ్వానంగా మారిన ఆదోని-హొళగుంద రహదారి

రోడ్డును బాగు చేయాలి

ఆదోని టౌన్: ఆదోని–హొళగుందకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దారి పొడవునా రోడ్డుపై గుంతలు పడడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారిందని ప్రజలు, వాహనాల చోదకులు, ఆర్టీసీ డ్రైవర్లు వాపోతున్నారు. ఆదోని నుంచి హొళగుందకు దాదాపు 30 కి.మీ దూరం ఉంది. ఆదోని నుంచి ధణాపురం సర్కిల్ వరకు రోడ్డు బాగుంది. ధణాపురం–హొళగుంద వరకు అడుగడుగునా గుంతలే. పాదచారులు సైతం నడవలేని పరిస్థితి. ఇక వాహన చోదకుల పరిస్థితి ఏమిటో సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులకే ఎరుక. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురయ్యింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండడం వల్ల రోడ్డుపై కంకరతేలి గుంతలు పడింది. దీంతో ఆదోని నుంచి హొళగుందకు వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంగా 108 అంబులెన్స్‌ల్లో రోడ్డు ప్రమాద బాధితులు, గర్భిణులు, ఇతరత్రా జబ్బులతో బాధపడే బాధితులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే నరకప్రాయంగా భావిస్తున్నారు. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

చుక్కలు చూపుతున్న ఉల్లినారు ధర



గోనెగండ్లలో సాగుచేసిన ఉల్లినారు

- ఒక మడి (బెడ్) ధర రూ.3 వేలు

గోనెగండ్ల: నిన్న మొన్నటి వరకు ఉల్లి నారు వైపు కన్నెత్తి చూడని రైతులు నేడు ఉల్లి నారు కోసం పరుగులు తీస్తున్నారు. పది రోజుల క్రితం చిన్నపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువడం, మార్కెట్‌లో ఉల్లి ధర పెరుగుతుండటంతో రైతులు ఉల్లి పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఒక్కసారిగా ఉల్లి నారు ధర ఆకాశాన్ని అంటింది. ఉల్లి నారు సాగుచేసిన రైతులు అమాంతంగా రేటు పెంచేశారు. ఒక మడి (బెడ్) ధర రూ.3 వేలు పలుకుతుంది. ఒక ఎకరం విస్తీర్ణంలో ఉల్లినారు సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుంది. ఉల్లి విత్తనాల రేటు కూడా కిలో రూ.150 నుంచి రూ.600 వరకు పెరిగింది. ఒక ఎకరంలో ఉల్లి పంటను సాగు చేసేందుకు 6 నుంచి 8 బెడ్ల నారు కావాల్సి ఉంటుంది. అయితే కొద్ది రోజుల క్రితం ఉల్లికి ధర లేకపోవడంతో ఉల్లి నారు సాగుకు రైతులు మక్కువ చూపలేదు. మండలంలో ఇప్పటివరకు దాదాపు 50 ఎకరాల్లో మాత్రమే ఉల్లి నారు సాగుచేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఉల్లి ధరలు పెరుగుతున్న కారణంగా రైతులు ఆ పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఒక్కసారిగా నారుకు డిమాండ్ పెరిగింది. ఉల్లి నారు సాగుచేసిన రైతులకు కనక వర్షమే అని రైతులు చెప్పుకుంటున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల వద్ద హంద్రీ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న కృష్ణగిరి మండలానికి చెందిన మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు కోడుమూరు ఎస్‌ఐ బాల నరసింహులు ఆదివారం తెలిపారు. అనుమతుల్లేకుండా హంద్రీ నది నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలించరాదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ఎస్‌ఐ హెచ్చరికలు జారీ చేశారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



ఆదోనిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోని అర్బన్: బీజేపీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ జిందే సాయికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి రమాకాంత్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ భారత దేశం మొత్తం మీద ఒకే ప్రధానమంత్రి, ఒకే జెండా ఉండాలని పోరాటం చేశారన్నారు. అప్పటి ప్రభుత్వం ఆయన్ను బంధించి జైలులో పెట్టి హింసించడంతో మరణించారని చెప్పారు. ఆయన త్యాగాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని 18వ వార్డు ఎంఎం కాలనీ శక్తి కేంద్రంలో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు గోవిందరావు, ప్రకాష్‌గురు, రాజా బసవరాజ్, శ్రీనివాసులు, నాగరాజ్, అర్జున్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: భారతీయ జన సంఘ్ స్థాపకుడు, బీజేపీ మూల పురుషుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులర్పించారు. మంత్రాలయంలో ఆదివారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నల్లగొని విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదని ఆర్టికల్ 370 వెంటనే రద్దు చేయాలనే ఉద్యమ క్రమంలో 1953 జూన్ 23న బలిదానం కావడం జరిగిందన్నారు. ఆయన వర్ధంతిని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నాయకులు శ్రీరామకోటి రెడ్డి, ఉస్మాన్, అయ్యన్న, తిమ్మప్ప, భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి మృత్యుఒడికి..

- ట్రాక్టర్ కింద పడి జార్ఖండ్ యువకుడి మృతి



బోకుల్ సింకు మృతదేహం

కృష్ణగిరి: బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకుని జార్ఖండ్ నుంచి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం హట్‌గమాసియా జిల్లా నుంచి కొందరు వ్యక్తులు లక్కసాగరం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి అనే కంట్రాక్టర్ వద్ద కరెంటు పనులు చేసేందుకు 5 నెలల కింద వచ్చారు. వీరు కంబాలపాడు గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉంటూ రోజు కరెంటు పనులకు వెళ్లేవారు. శనివారం సాయంత్రం బోకుల్ సింకు(20), దునై అనే వ్యక్తితో కలిసి ట్రాక్టర్(ఏపీ39వీఎస్3488)ను తీసుకుని కంబాలపాడు నుంచి పెనుమాడకు వెళ్లారు. అక్కడున్న బావి వద్ద ఎత్తయిన ప్రదేశంలో ట్రాక్టర్ ఉంచి కట్టెలు లోడ్ చేస్తున్నారు. కుదుపులకు బోకుల్ సింకు కిందపడడం.. అదే సమయంలో ట్రాక్టర్ అతనిపై వెళ్లడంతో మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

'పది' తరువాతే ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాలి

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి తరువాతే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఏఐడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఎస్కే మొబీన ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇటీవల 9వ తరగతి నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం విడుదల చేసిన నోట్‌ను ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రపంచమంతా అంగీకరించిన విద్యా సూత్రం ప్రకారం 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్రకృతి, సమాజం వంటి మౌలిక విషయాలతోపాటు భాషలు, సాహిత్య అధ్యయనాన్ని అలవాటు చేసి వ్యక్తిత్వ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాయన్నారు. అలాకాకుండా 9వ తరగతి నుంచి ఒకేషనల్ కోర్సులను చదివేలా ప్రణాళికలు రూపొందించడం మంచికాదన్నారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

WANTED TEACHERS
Wanted Qualified Teachers to Teach HIGH SCHOOL
Telugu, Hindi, Maths, Biological Science
Attractive Salary
Contact: 94400 04994
SRI VIDYA ENGLISH MEDIUM HIGH SCHOOL - ADONI